సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 20 । ఆగస్టు । 2023



ఫ్రీ బస్ పాసుల పంపిణీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రెడ్‌కాన్వెంట్ పూర్వవిద్యార్థుల చారిట్రబుల్ ట్రస్ట్ ద్వారా శనివారం సాలిపేట బాలికల పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బస్సు పాసులు అందజేశారు.



శ్రీవారి పథకాలకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి పథకాలకు హైదరాబాద్‌కు చెందిన వెంపడ సురేష్, శ్రీలత దంపతులు శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు.

డెల్టాలకు 11,100 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శనివారం 11,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,500, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. అలాగే బ్యారేజీ నుంచి 97,352 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు.

న్యూస్‌రీల్

ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఆధిక్యం



ఓదూరు నూతన సర్పంచ్ విమలకుమారి, శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న మంత్రి వేణు

సాక్షి, అమలాపురం: జిల్లాలోని వివిధ సర్పంచ్, పంచాయతీ వార్డు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఆధిక్యం సాధించింది. జిల్లాలో రెండు సర్పంచులు, 21 వార్డులకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. ఒక సర్పంచ్, 15 మంది వార్డు సభ్యులు ఇప్పటికే ఏకగ్రీవం అయ్యారు. మిగిలిన ఒక సర్పంచ్, ఆరు వార్డు సభ్యుల పదవులకు శనివారం ఉప ఎన్నికలు జరిగాయి. రామచంద్రపురం మండలం ఓదూరు సర్పంచ్‌గా వింజుమల్ల విమలకుమారి (వైఎస్సార్ సీపీ) 335 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇక్కడ టీడీపీ మద్దతుతో పోటీ చేసిన తాతపూడి గంగాభవానీకి 34 ఓట్లే రావడంతో డిపాజిట్లు కూడా దక్కలేదు. వీరితో పాటు పోటీ చేసిన కోణాల అనంతలక్ష్మికి ఒక్క ఓటు మాత్రమే వచ్చింది. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి మూడో వార్డుకు గుత్తాల జ్యోతి (వైఎస్సార్ సీపీ) 104 ఓట్లు, మండపేట మండలం తాపేశ్వరం 14వ వార్డుకు మేడిశెట్టి వీరేంద్ర (వైఎస్సార్ సీపీ) 13 ఓట్లు, అల్లవరం మండలం కొమరగిరిపట్నం 4వ వార్డుకు ఉల్లింగి సంజయరాణి (వైఎస్సార్ సీపీ) 95 ఓట్లు, రావులపాలెం మండలం ఊబలంక 3వ వార్డుకు కొవ్వూరి సాయిలక్ష్మి (వైఎస్సార్ సీపీ) 123 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అంబాజీపేట మండలం మాచవరం 13వ వార్డు నుంచి మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఆత్రేయపురం మండలం ర్యాలి ఒకటో వార్డులో తూటారపు బాలసుబ్రమ్మణ్యం గెలిచారు. మాచవరం 13వ వార్డు ఉప ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా తనిఖీ చేశారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుల నియామకం

- డాక్టర్స్ సెల్‌కు సత్యకృష్ణ
- సేవాదళ్‌కు అంజిబాబు



చోడే సత్యకృష్ణ



అంజిబాబు

మండపేట: వైఎస్సార్ సీపీ డాక్టర్స్, సేవాదళ్ విభాగాలకు జిల్లా నూతన అధ్యక్షులు నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం సాయంత్రం వీరి నియామకాలను ప్రకటించింది. జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షునిగా మండపేటకు చెందిన డాక్టర్ చోడే సత్యకృష్ణ నియమితులయ్యారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి మనవడైన ఆయన గతంలో పార్టీ యువజన విభాగం మండపేట నియోజకవర్గ కన్వీనర్‌గా చురుకైన పాత్ర పోషించారు. మండపేటలో యువతలో ఆయనకు మంచి ఫాలోయింగ్ ఉంది. అలాగే సేవాదళ్ విభాగం జిల్లా అధ్యక్షునిగా అమలాపురానికి చెందిన మంగళంపల్లి ఆంజనేయమూర్తి (అంజిబాబు) నియమితులయ్యారు. విద్యావేత్తగా మంచి పేరున్న అంజిబాబు గతంలో బ్రాహ్మణ సేవా సంఘంలో నాయకునిగా ఉన్నారు. బీఎస్ఎన్ఎల్‌లో పని చేస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచీ క్రియాశీలకంగా పని చేస్తున్నారు.

కొనసాగుతున్న సీఐడీ సోదాలు

అమలాపురం టౌన్/మండపేట: మార్గదర్శి చిట్‌ఫండ్ బ్రాంచిల్లో మూడో రోజైన శనివారం కూడా సీఐడీ సోదాలు కొనసాగాయి. సీఐడీ అధికారులతో పాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రెవెన్యూ, విజిలెన్స్, సేల్స్ ట్యాక్స్ అధికారులతో కూడిన బృందం ఈ తనిఖీలు చేశాయి. సిబ్బందిని పక్కన కూర్చోబెట్టి సోదాలు కొనసాగించారు. శనివారం కూడా కొంత మంది డిపాజిటర్లకు అధికారులు ఫోన్లు చేసి సమాచారం సేకరించారు. మండపేటలోని మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయంలో కూడా సీఐడీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ ఇతర అధికారులు రాత్రి వరకూ సోదాలు చేశారు.

చంద్రన్నా.. భవిష్యత్తుకు.. గ్యారెంటీ లేదన్నా..

- నిష్ప్రయోజనంగా చంద్రబాబు జిల్లా పర్యటన
- మూడు రోజులున్నా.. పార్టీ గెలుపునకు భరోసా కరవు
- ఆద్యంతం పొంతన లేని ప్రసంగాలు
- సభలకు జన స్పందన నిల్
- టీడీపీ క్యాడర్‌లో కానరాని జోష్
- ఫ్రస్ట్రేషన్‌తో వ్యక్తిగత దూషణలు
- అధినేత ప్రసంగిస్తుండగానే వెనుతిరిగిన శ్రేణులు





పరారే పరారే..: రావులపాలెం సభలో చంద్రబాబు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోతున్న ప్రజలు

సాక్షి, అమలాపురం: రాష్ట్రంలో ఎన్నికల ఫీవర్ మొదలయ్యింది. ప్రతిపక్ష టీడీపీకి ఈ ఎన్నికలు చావోరేవో అనే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ వ్యతిరేకతపై ఆశలు పెట్టుకున్నా అది ఏమాత్రం కనిపించడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి సానుకూల ఓటు కనిపించడం టీడీపీకి కొరుకుడు పడటం లేదు. గెలుస్తామన్న ధైర్యం పార్టీ క్యాడర్‌లో నానాటికీ దిగజారిపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏదో ఒక మాయ చేసి వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చేపట్టిన 'భవిష్యత్తుకు గ్యారెంటీ' యాత్రకు ప్రజల మద్దతు కొరవడింది. ఈ యాత్ర ద్వారా పార్టీకి 'భవిష్యత్తు' ఉంటుందనే భరోసాను కానీ, గెలుస్తామనే 'గ్యారెంటీ'ని కానీ పార్టీ క్యాడర్‌కు ఆయన కల్పించలేకపోయారు. జిల్లాలోని మండపేట, కొత్తపేట, అమలాపురం నియోజకవర్గాల్లో చంద్రబాబు మూడు రోజులు పర్యటించారు. ఎన్నికల ముందు చేపట్టిన ఈ యాత్రతో పార్టీలో కొత్త జోష్ వస్తుందని, దిశానిర్దేశం చేస్తారని, నియోజకవర్గ ఇన్‌చార్జిల నియామకం, నాయకుల మధ్య విభేదాల పరిష్కారానికి మార్గం చూపుతారని క్యాడర్ ఆశించింది. కానీ వీటిలో ఏ ఒక్కటీ చంద్రబాబు పర్యటనలో నెరవేరలేదు.

జనం లేక వెలవెల

మూడు నియోజకవర్గాల్లోనూ చంద్రబాబుకు పెద్దగా ఆదరణ లభించలేదు. వరుసగా మూడు సార్లు గెలిచిన మండపేట సభకు అంచనా వేసుకున్న జనంలో సగం మంది కూడా రాలేదు. సభను మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇరుకు సందులో ఏర్పాటు చేసినా నిండలేదు. రావులపాలెంలో అయితే బాబు ప్రసంగం ఆరంభం కాగానే పార్టీ నాయకులు, కార్యకర్తలు 'పరారే పరారే' అంటూ తిరుగుముఖం పట్టారు. జిల్లా కేంద్రం అమలాపురం సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. రోడ్డు షో చేస్తున్నా ఎక్కడా పట్టుమని పది మంది కూడా ఎదురేగి స్వాగతం పలకలేదు. రోడ్ షోలో జనం లేని విజువల్స్ సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొట్టడం రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ పరువు తీసింది. జనం కోసం సభలను ఆలస్యంగా ప్రారంభించాల్సి రావడం, జనాన్ని తీసుకురావాలంటూ అమలాపురంలో పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు చివరి నిమిషం వరకూ క్యాడర్‌ను బతిమలాడుకోవడం కనిపించింది.

అడిగి మరీ చప్పట్లు కొట్టించుకుంటూ..

చంద్రబాబు ప్రసంగాల్లో వాడీవేడి లేదు. సర్వం గందరగోళం. రైతుల గురించి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను తానే అభివృద్ధి చేశానని చెప్పారు. ఆ వెంటనే పోలవరం 75 శాతం తానే పూర్తి చేశానని, బాలయోగి హయాంలో కొబ్బరి కొనుగోలు చేశారని.. ఇలా ఒకదానికొకటి పొంతన లేకుండా ఇష్టానుసారం మాట్లాడారు. తన కొత్త విజన్-2047 గురించి బాబు చెప్పిన మాటలు ప్రజలకు అర్థం కాలేదు. అధికారంలోకి వస్తే చేస్తానన్న సూపర్ సిక్స్ హామీల వల్ల కలిగే లబ్ధిని వివరించినప్పుడు జనం నుంచి పెద్దగా స్పందన లేదు. దీంతో గత్యంతరం లేక అడిగి మరీ ప్రజలతో చప్పట్లు కొట్టించుకున్నారు.

వ్యక్తిగత దూషణలు

తాను అధికారంలోకి వస్తే ఎన్నో చేస్తానని చెబుతున్నా ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో సహనం కోల్పోయిన చంద్రబాబు.. చివరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలకు దిగారు. పలు సందర్భాల్లో సైకో, సైకో బ్యాచ్, మూర్ఖుడు.. ఇలా రకరకాలుగా దూషించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సైతం చిల్లర మనుషులంటూ విమర్శించి.. తన చిల్లర స్వభావాన్ని బయట పెట్టుకున్నారు.

విన్నది తక్కువ.. చెప్పింది ఎక్కువ

'ఆయన రేడియో లాంటి వారు.. మనం చెప్పింది వినరు. ఆయన చెప్పాలనుకున్నదే చెప్పుకుంటూ పోతారు' అంటూ పాపులర్ అయిన ఓ సినిమా డైలాగ్... చంద్రబాబు విషయంలో అచ్చు గుద్దినట్టు సరిపోతుంది. ఆయా నియోజకవర్గాల్లో మేధావులు, మహిళలు, రైతులు, పార్టీ నియోజకవర్గ సమీక్ష సమావేశాల్లో ఎదుటి వారు చెప్పింది తక్కువే అయినా.. బాబు మాత్రం గంటల తరబడి ప్రసంగాలు దంచికొట్టారు. మండపేట నియోజకవర్గం ఏడిదలో రైతులతో ఏర్పాటు చేసిన రచ్చబండలో ఏకంగా 45 నిమిషాలు మాట్లాడేశారు. చివరకు ఆలమూరులో ఆర్టీసీ బస్సు ఎక్కినప్పుడు సైతం ప్రయాణికులు చెప్పింది వినకుండా.. మైకు తీసుకుని అక్కడ కూడా ప్రసంగించేయడం విశేషం.

దిశానిర్దేశం చేయకుండానే...

ఇంత హడావుడీ చేసిన చంద్రబాబు.. ఎన్నికలను ఎదుర్కొనే విషయంలో పార్టీ క్యాడర్‌కు ఎటువంటి దిశా నిర్దేశం చేయలేదు. జిల్లాలో మూడు రోజులున్నా పి.గన్నవరం, రామచంద్రపురం నియోజకవర్గాలకు పూర్తి స్థాయి పార్టీ ఇన్‌చార్జిలను నియమించే విషయం తేల్చలేదు. అమలాపురం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో ఉన్న అసంతృప్తులను చల్లార్చలేదు.

కొసమెరుపు ఏమిటంటే.. అధినేత పర్యటన టీడీపీ క్యాడర్‌లో జోష్ నింపలేదు. కానీ, అమలాపురం సభ అట్టర్‌ఫ్లాప్ అవ్వడం మాత్రం ఇక్కడి ఇన్‌చార్జి ఆనందరావు వ్యతిరేకులను ఖుషీ చేసింది.

చంద్ర 'బాబా'..

రావులపాలెం సభలో చంద్రబాబు చేసిన విచిత్ర ప్రసంగానికి అందరూ అవాక్కయ్యారు. తాను పంపే రాఖీలను దేవుని వద్ద 45 రోజులు ఉంచాలని, అవి చేతికి కట్టుకుని.. సమస్య వచ్చినప్పుడు తనను తలచుకుంటే పరిష్కారమవుతుందని చెప్పారు. ఏవో అతీంద్రియ మహిమలున్న ఓ బాబా మాదిరిగా చంద్రబాబు చెప్పిన ఆ మాటలు విని.. నివ్వెరపోవడం సభకు వచ్చిన మహిళల వంతయ్యింది.

సత్తా చాటుతున్నారు

- ఆసక్తికరంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు
- పాల్గొంటున్న జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు
- ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి రాక
- మెన్స్ డబుల్స్, 45+ విభాగాల్లో హోరాహోరీ పోరు



45+ డబుల్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు

సాక్షి, అమలాపురం: జిల్లా కేంద్రం అమలాపురంలో మూడు రోజుల పాటు జరిగే ఉభయ తెలుగు రాష్ట్రాల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. మెన్స్ డబుల్స్, 45+ డబుల్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతున్నాయి. వీటికి హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాల నుంచి క్రీడాకారులు వచ్చారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు రావడంతో పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. ఈ పోటీలను దివంగత క్రీడాకారుడు సాధనాల శ్రీనివాసరావు (వాసు) పేరిట కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, ఆఫీసర్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తోంది. రెండో రోజైన శనివారం పలువురి మధ్య హోరాహోరీ పోరు సాగింది. ఇండోర్ స్టేడియంలోని ఇటీవల సిమెంట్ కోర్టును తొలుత వుడెన్ కోర్టుగా మార్చగా.. తరువాత దీనిపై హవా మ్యాట్‌లు వేశారు. నిర్మాణం పూర్తయిన తరువాత ఇదే పెద్ద టోర్నీ కావడంతో నిర్వాహకులు పక్కాగా ఏర్పాట్లు చేశారు. ఆయా విభాగాల్లో విజేతలకు రూ.1.60 లక్షల నగదు బహుమతులు అందించనున్నారు. పోటీలను వెటరన్ క్రీడాకారులు కె.పద్మనాభం, డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ, కల్వకొలను బాబు, రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ పర్యవేక్షిస్తున్నారు. రిఫరీలుగా కొణిదెల రమేష్, పాయసం శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్, అడబాల శ్రీనివాస్, గొలకోటి శ్రీనివాస్, పీఈటీ జి.సరస్వతి, విక్రమాదిత్య, డాక్టర్ సురేష్ వ్యవహరిస్తున్నారు.

కోర్టు అత్యాధునికంగా ఉంది



బీవీఎస్‌కే లింగేశ్వరరావు

విశాఖపట్నానికి చెందిన బీవీఎస్‌కే లింగేశ్వరరావు 41 ఏళ్లుగా షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో రెండుసార్లు మెన్స్ టోర్నమెంట్ ఆడిన ఆయన 14 సార్లు మాస్టర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నారు. వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎనిమిదిసార్లు ఎంపికయ్యారు. 2013లో టర్కీలో జరిగిన పోటీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో, 2019లో సింగిల్స్ విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. త్వరలో కొరియాలో జరిగే అంతర్జాతీయ టోర్నీలో పాల్గొనున్న లింగేశ్వరరావు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అమలాపురం వచ్చారు. 'గతంలో పలు సందర్భాల్లో ఆఫీసర్స్ క్లబ్ ఇండోర్, అవుట్‌డోర్ కోర్టుల్లో ఆడాను. కోర్టును అత్యాధునికంగా తీర్చిదిద్దడం చాలా సంతోషం' అని లింగేశ్వరరావు చెప్పారు.

ఇక్కడి నుంచే అడుగులు



యాళ్ల సతీష్

అమలాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ల సతీష్ సైతం బాడ్మింటన్ క్రీడాకారుడు. 1991 నుంచి ఆయన ఇదే స్టేడియంలో షటిల్ నేర్చుకున్నారు. ప్రస్తుత టోర్నమెంట్‌లో మెన్, 45+ డబుల్స్ విభాగాల్లో ఆడుతున్నాడు. పలుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న ఆయన ఏపీ టీచర్స్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆరుసార్లు సింగిల్స్, డబుల్స్‌లో విజేతగా నిలిచారు. రెండుసార్లు రన్నర్‌గా, మిక్స్‌డ్ డబుల్స్‌లో రెండుసార్లు విన్నర్, రెండుసార్లు రన్నర్‌గా నిలిచారు. 'ఇదే కోర్టులో ఆడి ఎంతో మంది అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించారు. వారిలో జేమ్స్, సాత్విక్ ఉన్నారు. వారితో కలిసి ఆడటం చాలా సంతోషంగా అనిపిస్తోంది' అని సతీష్ తెలిపారు.

సాత్విక్‌తో కలిసి ఆడాను

హైదరాబాద్‌కు చెందిన సుధీష్ వెంకట్ 12 ఏళ్లుగా షటిల్ ఆడుతున్నారు. మన దేశంతో పాటు, మయన్మార్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న ఆయన అంతర్జాతీయ అండర్-19 విభాగంలో క్వార్టర్స్‌కు వెళ్లారు. తెలంగాణ స్టేట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచారు. సౌత్ జోన్‌లో మూడో స్థానంలో నిలిచారు. 'ఇక్కడ టోర్నమెంట్ ఆడటం చాలా సంతోషంగా ఉంది. ఇదే స్టేడియంలో సాత్విక్‌తో కలిసి ఆడాను' అని సుధీష్ చెప్పారు.



సుధీష్



కె.సాయి పవన్

సంతోషంగా ఉంది

రాజమహేంద్రవరానికి చెందిన కె.సాయి పవన్ ఆసియన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన టోర్నీలో విజేతగా నిలిచిన ఆయన సౌత్ జోన్ స్థాయి డబుల్స్‌లో కాంస్యం సాధించారు. ప్రస్తుతం హైదరాబాద్ ఎ-జోన్‌లో శిక్షణ పొందుతున్నారు. 'కోనసీమలో ఉమ్మడి రాష్ట్ర స్థాయి టోర్నీ ఆడటం చాలా సంతోషంగా ఉంది. కోర్టును అధునాతనంగా తీర్చిదిద్దారు. ఏర్పాట్లు ఇంకా బాగున్నాయి' అని చెప్పారు.

బాలబాలాజీ సన్నిధిలో భక్తజన కోలాహలం



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలబాలాజీ స్వామి ఆలయంలో శనివారం భక్తుల కోలాహలం నెలకొంది. వైనతేయ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు.. స్వామి వారికి తలనీలాలు, ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ.2.75 లక్షల ఆదాయం సమకూరిందని ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2.04 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలుగా రూ.71,182 వచ్చాయని వివరించారు. స్వామి వారిని 3,854 మంది దర్శించుకున్నారని, 3,162 మంది అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కడలి నూకయ్య స్మారకార్థం కడలి వీర వెంకట గోపాలకృష్ణ, భారతి, కుటుంబ సభ్యులు స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఆన్‌లైన్ ద్వారా రూ.50,116 విరాళం సమర్పించారు. అమలాపురానికి చెందిన ఆశపు వ్యాఘ్రేశ్వరరావు, అనంతలక్ష్మి దంపతులు రూ.10,116 అందజేశారు.



క్లుప్తంగా

వాడపల్లి వెంకన్నకు రూ.35.10 లక్షల ఆదాయం



ఆలయంలో భక్తజనసందోహం



ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి శనివారం రూ.35,10,670 ఆదాయం సమకూరింది. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ విక్రయం, విరాళాల ద్వారా ఈ ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామివారిని వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. సుమారు 35 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

దూసుకువచ్చిన మృత్యువు

- ట్రాలీ ఢీకొని ఇద్దరి దుర్మరణం
- రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం

కిర్లంపూడి: బైక్‌పై వెళ్తున్న ఆ ఇద్దరి పైకి ట్రాలీ రూపంలో మృత్యువు దూసుకువచ్చింది. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరంలో జరిగిన ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. కిర్లంపూడి ఎస్సై బి.ఉమామహేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని సింహాద్రిపురం అడ్డురోడ్డు నర్సరావు కాలనీకి చెందిన గొడుగుల దుర్గామల్లేశ్ (21) అడ్డురోడ్డులో మోటార్ సైకిల్ మెకానిక్ షాప్ నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఇసుకపల్లి బాల వీర వెంకట సత్య దుర్గసాయి అలియాస్ బాలు (15) ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. వీరిద్దరూ కలసి శుక్రవారం అర్ధరాత్రి ప్రత్తిపాడు వైపు బైక్‌పై వెళ్తున్నారు. అదే మార్గంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ జగపతినగరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వీరి బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలు అక్కడికక్కడే మరణించాడు. ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ దుర్గా మల్లేశ్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై శనివారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.



విలపిస్తున్న మల్లేశ్ భార్య, కుటుంబ సభ్యులు



మృతులు దుర్గా మల్లేశ్, బాలు (పాత చిత్రాలు)

వివాహమైన కొద్ది నెలల్లోనే..

ఈ ప్రమాదంలో మృతుడు దుర్గా మల్లేశ్ 15 నెలల కిందటే ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఏలేశ్వరం మండలం మొక్కారావు కాలనీకి చెందిన కొండేటి సోమరాజు కుమార్తె దేవి, మల్లేశ్ ప్రేమించుకుని, గత ఏడాది మే నెలలో పెళ్లి చేసుకున్నారు. ప్రేమించిన వ్యక్తితో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని దేవి ఎన్నో కలలు కంది. ఆ కలలు నెరవేరకుండానే ట్రాలీ రూపంలో మృత్యువు తన భర్తను బలిగొందని దేవి పెద్ద పెట్టున విలపిస్తోంది. మృతుడు మల్లేశ్‌కు భార్యతో పాటు తల్లిదండ్రులు నాగమణి, చిన్నరామస్వామి, సోదరి ఉన్నారు. అతడి మృతితో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

ప్రయోజకుడిని చేయాలని..

శివమ్మ, వీరబాబు దంపతులకు బాలు లేకలేక పుట్టిన ఒక్కగానొక్క సంతానం. దీంతో అతడిని ఎంతో గారాబంగా పెంచుకుంటున్నారు. తాము పడుతున్న ఇబ్బందులు కొడుకు పడకూడదనే ఉద్దేశంతో వడ్రంగి పనికి వెళ్తూ.. బాలును వారు బాగా చదివించుకుంటున్నారు. పెద్దయ్యాక ప్రయోజకుడై తమకు ఆసరాగా నిలుస్తాడని జీవిస్తున్న తమ ఆశల్ని మృత్యువు చిదిమేసిందంటూ బాలు తల్లిదండ్రులు గుండెలు పగిలేలా విలపిస్తున్నారు.

భారీగా గంజాయి పట్టివేత

- 345.42 కేజీల సరకు స్వాధీనం
- విలువ రూ.10 లక్షలుగా నిర్ధారణ
- ఇద్దరి అరెస్టు.. కంటైనర్ సీజ్

ఆలమూరు: సినీ ఫక్కీలో భారీ స్థాయిలో తరలిస్తున్న గంజాయి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ ఆదేశాల మేరకు.. జొన్నాడ ఆంజనేయ స్వామి ఆలయం సమీపాన.. 216ఏ జాతీయ రహదారిపై రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్, ఆలమూరు ఎస్సై పి.శివప్రసాద్ నేతృత్వంలో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ కంటైనర్‌లో 17 బస్తాల్లో నింపి తరలిస్తున్న 345.42 కేజీల గంజాయి పట్టుబడింది. కంటైనర్ వెనుక భాగం ఖాళీగా ఉన్నప్పటికీ.. ఎవ్వరికీ అనుమానం రాని విధంగా డ్రైవర్ క్యాబిన్‌లో రహస్యంగా అమర్చిన బాక్సుల్లో ఈ గంజాయి బస్తాలు నింపి తరలిస్తున్న తీరు పోలీసులను సైతం విస్మయపరచింది. మొత్తం సరకును తహసీల్దార్ ఐపీ శెట్టి సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.10 లక్షలుంటుందని అంచనా వేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ముంబైకి ఈ గంజాయిని తరలిస్తున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. గంజాయి తరలింపులో కీలక పాత్ర పోషించిన సునీల్ అప్పా బోరాడి, ఇస్లాం నయి మొహిద్దిన్ షేక్‌ను అరెస్టు చేశారు. కంటైనర్‌ను కూడా స్వాధీనం చేసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే దురాశతోనే గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్టు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో నిందితులిద్దరూ అంగీకరించారు. రెవెన్యూ శాఖ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేయగా, సీఐ రజనీకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.



కంటైనర్‌ను, గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

తుపాకీ పేలి బాలిక మృతి చెందిన కేసులో నలుగురి అరెస్టు

తుని రూరల్: నాటు తుపాకీ పేలి, నాలుగేళ్ల బాలిక మృతి చెందిన కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు రూరల్ సీఐ ఎ.సన్యాసిరావు శనివారం తెలిపారు. ఈ నెల 15వ తేదీన తుని మండలం లోవకొత్తూరులో నాటుతుపాకీ మిస్ ఫైర్ అయ్యి పలివెల ధన్యశ్రీ (4) మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎ.సన్యాసిరావు, ఎస్సై కె.విజయబాబు, పోలీసులు దర్యాప్తు చేశారు. బాధ్యులైన నలుగురు నిందితులను అరెస్టు చేసి, తుపాకీని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. అరెస్టయిన వారిలో లోవకొత్తూరుకు చెందిన సిద్ధాంతపు దుర్గాప్రసాద్, అనంతారపు సూరిబాబు, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం నర్సాపురానికి చెందిన యర్రంశెట్టి వలపు, కోటపాడు మండలం కె.సంతపాలెం గ్రామానికి చెందిన బల్లంకి సత్యనారాయణ ఉన్నారు. వారి నుంచి తుపాకీ స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. వీరిని శుక్రవారం సాయంత్రం పాయకరావుపేట శివారులో అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని సీఐ వివరించారు.



స్వాధీనం చేసుకున్న తుపాకీ, నిందితులతో రూరల్ సీఐ, ఎస్సైలు

ముగిసిన శ్రీప్రకాష్ వ్యవస్థాపక వేడుకలు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల 47వ వ్యవస్థాపక వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీప్రకాష్ తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం శాఖల విద్యార్థులకు ఏర్పాటు చేసిన 'గాతా రహే మేరా దిల్' పాటల పోటీలకు హంగేరీ దేశానికి చెందిన ప్రముఖ పఖ్వాజ్ విద్వాంసులు బలాజ్స్ విరాగ్, టీఈ రాణి న్యాయ నిర్ణేతలుగా హాజరయ్యారు. విరాగ్ మాట్లాడుతూ, ప్రపంచంలో భారతీయ సంగీతం వైవిధ్యమైనదని అన్నారు. పాతశైలి పఖ్వాజ్ సంగీతంపై భావితరాలకు మక్కువ కలిగేలా ప్రదర్శనలు ఇస్తున్నానని చెప్పారు. భారతీయ శాస్త్రీయ సంగీతంలో దశాబ్దానికి పైగా శిక్షణ పొందిన తాను ఇప్పటికీ ప్రదర్శనల కంటే తన స్వీయ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. సంగీతాభిరుచి కలిగిన విద్యార్థులు నిత్య సాధనతోనే ఉత్తమ ఫలితాలు అందుకోగలరని చెప్పారు. విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీ నరసింహారావు మాట్లాడుతూ, తమ విద్యాసంస్థలు గత 47 సంవత్సరాలుగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాయని అన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శ్రీప్రకాష్ డిగ్రీ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రోటరాక్ట్ క్లబ్ విద్యార్థులు 120 యూనిట్ల రక్తం సేకరించి, కాకినాడ రోటరీ బ్లడ్‌బ్యాంకు, తుని మదర్ బ్లడ్‌బ్యాంకులకు అందజేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ యోగా గురువు వబ్బలరెడ్డి దుర్గాప్రసాద్‌ను శ్రీప్రకాష్ అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయప్రకాష్ సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, కన్వీనర్ సీతారాణి, ఏపీపీఎస్సీ సభ్యుడు సోనీవుడ్ తదితరులు పాల్గొన్నారు.



యోగా గురువు దుర్గా ప్రసాద్‌ను సత్కరిస్తున్న శ్రీప్రకాష్ అధినేత నరసింహారావు, కార్యదర్శి విజయ్‌ప్రకాష్

డ్రైవింగ్, ఆర్‌సీ కార్డులకు చెల్లు

- ఏపీ ఆర్‌టీఏ యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసిన పత్రం చాలు
- అమల్లోకి నూతన నిబంధన
- ఇప్పటి వరకూ పెండింగ్‌లో ఉన్న 35 వేల కార్డుల జారీకి ఏర్పాట్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ కార్డు) పొరపాటున ఇంటి వద్ద మరచిపోయి, సొంత కారు లేదా బైక్‌తో రోడ్డు మీదకు వస్తే.. పోలీసులు, రవాణా అధికారులు ఫైన్ వేయడం.. తరువాత వాటిని చూపిస్తే ఫైన్ మాఫీ చేయడం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం అటువంటి కష్టాలకు చెక్ పడింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అన్నింటా డిజిటలైజేషన్ అమలు చేస్తున్న నేపథ్యంలో రవాణా శాఖ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. డ్రైవింగ్, ఆర్‌సీ కార్డుల స్థానంలో సంబంధిత యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న పత్రం చూపిస్తే సరిపోతుంది. రవాణా శాఖకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ వాహన్ పరివార్ సేవలన్నీ ఇప్పటికే ఆన్‌లైన్ అయ్యాయి. దీంతో చాలా రాష్ట్రాలో కార్డులు తొలగించి డిజిటల్ పత్రాలు తీసుకువచ్చారు. దీని అమలును ఈ నెల 8 నుంచి మన రాష్ట్రంలో కూడా ఆరంభించారు. లైసెన్స్, ఆర్‌సీ జారీకి కార్డుకు రూ.200, పోస్టల్ చార్జీలుగా రూ.25 తీసుకుని పోస్టల్ ద్వారా నేరుగా ఇంటికే పంపించే వారు. కార్డులు ప్రింట్ కాకపోవడం, పోస్టల్ ఆలస్యం వంటి కారణాలతో రెండు మూడు నెలలైనా కార్డు చేతికి రాని పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా దాదాపు 35 వేల ఆర్‌సీ, డ్రైవింగ్ కార్డులకు ఫీజు వసూలు చేశారు. దీంతో వాటి వరకూ ప్రింట్ చేసి, వాహన చోదకులకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు.

రవాణా శాఖ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్//ఏపీఆర్‌టీఏసీ సిటిజన్.ఈప్రగతి.ఓఆర్‌టీ నుంచి ఫారం 6 లేదా 23 డౌన్‌లోడ్ చేసుకుని ధ్రువపత్రం తీసుకోవాలి. లేదా ఏపీఆర్‌టీఏ సిటిజన్ ఆండ్రాయిడ్ మొబైల్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాహనాలు తనిఖీ చేసేటప్పుడు పోలీస్ లేదా రవాణా అధికారులకు డౌన్‌లోడ్ చేసిన పత్రాలు చూపిస్తే సరిపోతుంది. వీటిని అనుమతించాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.



డ్రైవింగ్ లైసెన్స్

ఇకపై కార్డుల పంపిణీ ఉండదు



రవాణా శాఖ జారీ చేసే ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సులకు సంబంధించి ఇకపై కార్డులు పంపిణీ ఉండదు. ఇప్పటి వరకూ ఉన్న కార్డులు ప్రింట్ చేసి, త్వరలో వాహనదారులకు అందజేస్తాం. డ్రైవింగ్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు రవాణా శాఖ యాప్ నుంచి పత్రం డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది.

– ఎ.మోహన్, జిల్లా రవాణా అధికారి, కాకినాడ

ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ

పి.గన్నవరం: మండలంలోని బెల్లంపూడిలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు ఒక ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేశారు. ఎస్సై హరికోటి శాస్త్రి కథనం ప్రకారం.. బెల్లంపూడికి చెందిన బండి పద్మావతి మూడు రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి, అనారోగ్యంతో ఉన్న తల్లిని చూసేందుకు కాకినాడ వెళ్లింది. ఆమె భర్త లక్ష్మణ్ కోదాడలో సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. ఇద్దరు కుమార్తెలు విజయవాడలో చదువుతున్నారు. శనివారం ఉదయం ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం గమనించిన స్థానికులు పద్మావతికి సమాచారం అందించారు. దీంతో ఆమె వెంటనే ఇంటికి చేరుకుని, చోరీ జరిగినట్టు నిర్ధారించుకున్నారు. బీరువాలోని 20 కాసుల బంగారు నగలు, రూ.50 వేల నగదును దొంగలు చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన ఇంటిని ఎస్సైతో పాటు సీఐ ప్రశాంతకుమార్ పరిశీలించారు. క్లూస్ టీమ్ సభ్యులు వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ ప్రశాంతకుమార్, ఎస్సై హరికోటి శాస్త్రి

చలపతిరావుకు ఏరువాక ఫౌండేషన్ అవార్డు

అంబాజీపేట: వ్యవసాయ, అనుబంధ రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన శాస్త్రవేత్తలకు ఏరువాక ఫౌండేషన్ ఎక్సలెన్స్ అవార్డును అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావుకు లభించింది. విజయవాడలోని కోనేరు లక్ష్మయ్య విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏరువాక ఫౌండేషన్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం జరిగింది. ఇందులో పాల్గొన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు జీవీ సుబ్బారెడ్డి, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఫుడ్ ప్రాసెసింగ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్ చిరంజీవి చౌదరి చేతుల మీదుగా చలపతిరావు ఈ అవార్డు అందుకున్నారు. కొబ్బరి, కోకో పంటల్లో జీవ నియంత్రణ పద్ధతులను రైతులకు చేరవేయడంతో పాటు అవగాహన కల్పించి, వినియోగంలోకి తీసుకువచ్చినందుకు గాను ఏరువాక ఫౌండేషన్ ఎక్సలెన్స్ అవార్డు లభించినట్లు చలపతిరావు తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, జీడీసీసీబీనున్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారన్నారు. పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, సిబ్బంది చలపతిరావుకు అభినందనలు తెలిపారు.



ఏరువాక ఫౌండేషన్ ఎక్సలెన్స్ అవార్డును అందుకుంటున్న చలపతిరావు